# గురవయ్య మరణించాడు

అతడి ముగ్గురు కొడుకులూ దగ్గరేఉన్నారు. కూతుళ్లు అతడి పక్కనే కూర్చుని కన్నీరు కారుస్తున్నారు.

భార్య చనిపోయిన తరువాత అతడొక్కడే మేడ కిందభాగంలో ఉంటున్నాడు. మేడమీద అద్దెకిచ్చాడు. స్వయంగా వంటచేసుకుని, తిని, ముందుగదిలో కుర్చీమీద కూర్చుని చుట్ట కాల్చుకుంటూ కిటికీలోనుంచి వీధిలో వచ్చేపోయే జనాన్ని చూస్తూ ఉంటాడు.

పొద్దున్నే లేచి స్నానంచేసి జపంచేస్తాడు. ఆయన పూజకు పూలు తులసి దళాలు పెరట్లోనుంచి తెచ్చుకుని రెండుగంటలసేపు పూజగదిలో ఉంటాడు. అతడితో మాట్లాడటానికి ఎవరూరారు. ఒకవేళ వచ్చినా పదకొండు గంటల వరకూ వాకిట్లో ఉండవలసిందే.

గురవయ్య అలా చుట్టకాల్చుకుని పక్కగదిలో మంచమ్మీద ఒరుగుతాడు. అతడు నిద్రలేచేసరికి గడియారం మూడు గంటలు కొడుతుంది. కాఫీ చేసుకుని తాగుతాడు.

అదీవేళ-అతడు ఇతరులతో మాట్లాడటానికి.

ఆ ఊరు పెద్దదే. అది ఒకరేవు పట్టణం. ఆ ఊరిలో చల్లరస్తా అని ఒక వీధి ఉంది. ఆ వీధిలోనుంచి నిజాం సంస్థానంలో ముఖ్యపట్టణమైన భాగ్యనగరానికి దారి ఉన్నదని స్థానికులలో పెద్దతరం వారు చెప్పుకుంటారు. గురవయ్య పూర్వులు ఎప్పుడు ఎక్కడినుంచి వచ్చారో తెలియదు కాని-మూడు తరాలనుంచీ ఆ ఊళ్ళోనే ఉంటున్నారు. నలభయిఎకరాల పొలం పెద్దలు సంపాదించారు. గురవయ్య తండ్రి ఆమేడ కట్టించాడు.

గురవయ్య భార్య చనిపోయి పదిహేనేళ్ళయింది. ఈమధ్య అంటే ఎనిమిది సంవత్సరాలనుంచీ అతడి స్వభావంలో మార్పు కనబడుతున్నట్టుగా అతడి కొడు-

కులు అనుకుంటారు. పొలాల విషయం చూసే రెండవ కొడుకూ, కరిణీకం చేసే పెద్దకొడుకూ, ఇల్లు పూర్తిగాఅద్దెకిచ్చి తమదగ్గర ఉండమన్నారు. కాని గురవయ్య యింటినుంచి కదలనని మొండికేశాడు. వాళ్లు వారానికి ఒకసారి చూడ టానికి వస్తే పనిమీద శ్రద్ధ చూపండని మరునాడే పంపేస్తున్నాడు.

''నాన్నకు కోపం ఎక్కువయిందా లేక నారాయణ చచ్చిపోయాడన్న దుఃఖమా ? ఆయనలో చాలా మార్పు వచ్చింది" అనుకుంటారు వాళ్లు. కాని నోటితో అడగలేరు, కొంత భయం, కొంత మొదటినుంచీ చనవు తక్కువ. ఆడపిల్లలు తల్లిపోయిన తరువాత రాకపోకలు తగ్గించారు.

"అమ్మ ఎట్లాగూ లేదు, ఉన్న నాన్నయినా రెండేళ్ళ కొకసారయినా రమ్మని పిలవడు. ఆడపిల్లలు గదా అని చీరెగుడ్డయినా పెట్టడు. ఇదివరకూ నయమే గాని ఈమధ్యే మారిపోయాడు. నారాయణ అలా ''సముద్రంలో పడి చనిపోయినప్పటినుంచీ మాటే మాట్లాడడు" అనుకుంటారు వాళ్ళల్లో వాళ్ళు.

గురవయ్య దగ్గరికి ఈమధ్య రైతులు మాట్లాడటానికి ఎక్కువగా వస్తు న్నారు. వాళ్ళంతా సన్నకారు రైతులు. ఎరువులకూ, పన్నుకట్టటానికీ, ఎడ్లుకొను క్కోవటానికీ, అప్పుకోసం వస్తారు. సాధారణంగా సన్నకారు రైతులకు అప్పు లిచ్చే ఆసామీ వాళ్ళ భూములను గురించీ పంటలను గురించీ బాగా తెలుసుకున్న వాడయి ఉంటాడు. గురవయ్యకు ఎవరిపొలం ఎట్లాపండేదీ, ఆ భూమి ఎకరం ఎంతధర చేసేదీ బాగా తెలుసుకుంటున్నాడు ఈమధ్య. అతడు తనతో మాట్లాడ టానికి వచ్చిన రైతులను చాలా మర్యాద చేస్తున్నాడు. గొప్ప భూస్వామినని గర్వ పడటం లేదు. ఎన్నడు లేనిది వాళ్ళకు మంచినీళ్ళందివ్వటమూ చుట్టముక్కలం దివ్వటమూ "కుర్చీమీద కూర్చో, ఫరవాలేదు'' అనటమూ చూస్తే రైతులకే అతడిలో వచ్చిన మార్పు ఆశ్చర్యకరంగా ఉంది.

''తీసుకు వెళ్ళవయ్యా, నీకు కావల్సినంత డబ్బు తీసుకెళ్ళు, నోటురాయి. సాక్షులిద్దరి చేతనయినా సంతకం పెట్టించు. నీవు తిరిగి బాకీ ఎప్పుడు చెల్లించ గలవో ఆ నోటుమీద రాయి. ఆలా షరతుప్రకారం ఇవ్వలేకపోతే వడ్డీ రెట్టింపవు తుందని కిందరాయి" అంటాడు మామూలుగా మాట్లాడినట్టు.

"ఇస్తాను పంతులూ, పంటరాగానే ఇస్తాను.''

"తీసుకునేటప్పుడు వెంటనే ఇవ్వాలనే ఉంటుంది. కాని సంసారాలున్నాయే, అవి నీమాట సాగనివ్వవు. నేను నీచుట్టూ తిరగలేనుకదా ? ఇవ్వలేని దశలో నీవు నాకంటికి కనబడవు. అందుకని నీకెంతకావాలో చెప్పు. దానికి సరిపడ్డ భూమిని తాకట్టుపెట్టు. భూమి పోతుందన్న భయంకొద్దీ నీవే నీభార్య నగలే అమ్ముతావో, ఇల్లే అమ్ముతావో, డబ్బు తీసుకువచ్చి విడిపించుకో. నేనన్న మాటలో ఏదయినా పొల్లుమాట ఉందా ? పెద్దమనుషులను అడుగు" అంటాడు.

అక్కడ కూర్చున్న వాళ్ళందరూ అతడితో పనిఉన్న వాళ్ళు. అతడి స్వభావం తెలిసిన వాళ్లు. పంతులు సూచించిన మార్గాన్ని అనుసరించిన వాళ్ళు. డబ్బు అవసరమున్నవాడు అందరి ముఖాలూ చూస్తాడు. అందరూ అంతే. అదొక్కటే మార్గమని కళ్ళతో సూచిస్తారు.

తన ఇంటి ఖర్చులూ, పొలం ఖర్చులు పోను పంటమీద వచ్చే డబ్బూ కొడుకు అందించినదీ, ఇనపెట్టెలో నుంచి తీసి లెక్కబెట్టి ఇచ్చి తనఖాపత్రం భద్రంగా దాస్తాడు గురువయ్య. ఆవిధంగా ఈ మధ్యకాలంలో పదెకరాలు సంపాదించాడు.

గురవయ్యకు వారంరోజులు జ్వరం వచ్చింది. అదివరకూ అతడు డాక్టరు దగ్గరకెళ్ళి మందు తీసుకునేవాడు. ఈమధ్య వరదాచారితో పరిచయమైనప్పటి నుంచీ అతడి దగ్గరే మందు తీసుకుంటున్నాడు. ఒక్కొక్కప్పుడు వరదాచారి గురవయ్యకు సహాయంగా పడుకునే వాడు.

గురవయ్య చెప్పి పంపకపోయినా పొలాలు చూస్తున్న కొడుకు రెండవ వాడు పుండరీకాక్షుడు ఎవరివల్లనో తెలుసుకుని భార్యాబిడ్డలతో వచ్చి వాలాడు. కరిణీకం చేస్తున్న పెద్దకొడుకు భార్యను తీసుకువచ్చాడు. పెంపకం పోయిన కొడుకు శేషయ్యకూడా కన్నతండ్రిని చూడాలని వచ్చాడు. కబురందగానే కడసారి చూపయినా అందుతుందేమోనని ఆడపిల్లలు వచ్చారు.

ఆ రాత్రే గురవయ్య మరణించాడు.

కొడుకులు భూశయనం చేశారు. అంతా గొల్లుమన్నారు చుట్టూచేరి.

తెల్లవారి పదిగంటల తరువాత అన్నీ సమకూర్చుకుని దహనం చెయ్యాలి.

"నాన్న చేతికి రెండువేళ్లు లేవు. ఈమధ్య ఏదయినా దెబ్బ తగిలిందా ?" పెద్దకొడుకు అడిగాడు.

"ఏమో, ఏంజరిగిందో ? ఎడమచేతికి కదూ ? ఇన్నిసార్లు వచ్చాను, నాతో చెప్పనైనా లేదు. ఒంటరిగా ఉంటూ డాక్టరుచేత తీయించేసుకున్నాడేమో ?''

"అదేనా, ఒకసారి నేను వచ్చినప్పుడు ఇల్లు తాళంవేసి ఉంది. మేడ మీద వాళ్లనడిగితే ఊరికెళ్ళాడన్నారు అమ్మాయిలను చూసి చాలా రోజులయిందని వెళ్ళాడేమో ననుకున్నాను."

''అయినా ఈమధ్య ఒంటినిండా బట్టకప్పుకుని కూర్చోవటమూ తలనిండా ముసుగేసుకోవటమూ రహస్యంగా మాట్లాడినట్టు మాట్లాడటమూ మొదలుపెట్టాడు. డాక్టరు దగ్గరికి పోదామని ఎంత బలవంతం చేసినా రాలేదు. ఇంటికి వస్తే "వెళ్ళి నీపని చూసుకొమ్మని" గొడవచేసేవాడు. ఏమిటో మనిషి మారిపోయాడు" అనుకున్నారందరూ.

తెల్లవారి స్నానం చేయించేటప్పుడు "నాన్నకు బుజమ్మీద పెద్ద గాయ మెప్పుడయిందో ? చూడు పట్టీ ఉంది. ఇది సామాన్యమైన దెబ్బకాదు, ఇంకా మాన లేదు" అన్నాడు పెద్దకొడుకు.

తెలిసినవాళ్ళు పదిమందీ వచ్చారు. దహనక్రియలు జరిగాయి. అంతా తలా ఒకమూలా కూర్చున్నారు. తండ్రి పోయినతరువాత పంపకాల ఆలోచన వాళ్ళ మనసుల్లో మెదులుతున్నది. ఇల్లు వాటాలకు అనుకూలంగానే ఉంది. ఇక పొలాలు మంచీచెడ్డ చూసుకోవాలి అనుకుంటున్నారు. ఏదయినా దినవారాలు కావాలికదా అని బైటపడలేదు.

గురవయ్య మూడో కొడుకు నారాయణ విశాఖపట్నంలో మెడిసన్ చదువుతూ సముద్రంలో పడి చనిపోయాడన్న వార్త తెలిసింది, శవమైనా దొరకలేదు. అతడి భార్య జయంతి పురిటికి పుట్టింటికి వెళ్ళింది. మగపిల్లవాడిని కన్నదని విన్న తరువాతనే నారాయణ మరణించాడు. ఆ తరువాత, ఆమెకూడా చనిపోయిందన్న వార్త తెలిసింది. పిల్లవాడిని గురించి గురవయ్య పట్టించుకోలేదు. పెద్ద వాడు తండ్రి ఉన్నాడు. ఆయన చూసుకుంటాడని' అన్నదమ్ములు ఊరుకున్నారు.

దినవారాలయిన తరువాత, పదమూడో నాడు పెద్దకొడుకు ఇనపెట్టె

తెరిచాడు. ఆనాడే పంపకాలయిపోవాలని పట్టుబట్టాడు. ఇనప్పెట్టెలో పదిరూపాయలున్నాయి. ఏదో చిత్తుకాగితాలతో పాటు ఒక కవరు బయటకు తీశాడు.

''ఈ కవరు చింపి చదవలేదా నాన్న?'' అనుకుంటు అటూ ఇటూ తిప్పి చూశాడు.

అది పెంపకం పోయిన కొడుకు శేషయ్య పేరున ఉన్నది. దానిలో ఏమున్నదోనని పెద్దకొడుకు రెండవకొడుకు అనుమానంగా చూశారు.

శేషయ్య ఆ కవరందుకొని - తన పేరున వచ్చిన ఉత్తరాన్ని గురవయ్య ''ఇనప్పెట్టెలో ఎందుకు పెట్టుకున్నాడు?" అనుకుంటూ చింపి చదివాడు.

''శేషయ్యకు నమస్కరించి వ్రాయునది- నేను విశాఖపట్నంలో మెడిసన్ చదువుతున్న సంగతి మీకు తెలుసు. నాన్న నాకు నెలనెలా డబ్బు పంపుతూ వచ్చాడు. నేను బాగా చదువుతున్నాను. మొదట రెండు సంవత్సరాలు నాకు గోల్డు మెడల్సు కూడా వచ్చాయి. మూడో సంవత్సరంలోకి వచ్చాను. డబ్బు పంపమని నాన్నకు రెండు మూడు ఉత్తరాలు వ్రాశాను. "ఇంక చదివించలేను. డబ్బులేదంటూ" జవాబిచ్చాడు. నాకు బట్టలులేవు. ఫీజు కట్టాలి అంటు మళ్ళీ రాశాను "ఇంటికివచ్చి పొలాలు చూసుకో నీవు డాక్టరువై నీ చదువుకు పెట్టినదంతా సంపాదించగలవా ? నీకు పంపటానికి ఒక్క రూపాయికూడా లేదు మళ్ళీ నాకు ఇటువంటి ఉత్తరం వ్రాయవద్దని" కఠినంగా వ్రాశాడు. నేను చిల్లర ఖర్చులకు కూడా స్నేహితుల దగ్గర తీసుకుంటున్నాను. మరొక సంగతి. జయంతికి పెళ్ళిలో పెట్టిన నగలు తాకట్టు నగలని తీసుకున్నాడు. అవి ఉన్నా నేను చదువు పూర్తిచేసేవాడిని. అన్నయ్యా భాగాలు పంచుకునేటప్పుడు నీ అప్పు తీరుస్తాను. నా చదువు ఈ రెండు సంవత్సరాలయ్యే వరకు నాకు అప్పుగా పంపించు. నీకు వడ్డీ కావాలన్నా ఇస్తాను. నాన్న నాకు 'చచ్చినా రూపాయి పంపించను' అన్న తరువాత నాకు ఆ ఊరు రావాలని లేదు. ఆ ఊళ్ళో ఎవరికి నా ముఖము చూపించలేను. నీ దగ్గరికి వచ్చి అడగాలని ఉంది. కాని రావటానికి నా దగ్గర డబ్బులేదు. ఇక్కడ స్నేహితులు కొందరు నా భాగం కోసం కోర్టుకు వెళ్ళమంటున్నారు. అది తేలే వరకూ నా చదువు చెడిపోదా?

మన ఇంట్లో ఎవరికీ పెద్ద చదువులు లేవు. పెంపకం పోయావు కనుక

నీవు చదువుకొని ఉద్యోగం చేస్తున్నావు. మొదటి నుంచి నీమీద నాకు భక్తి గౌరవాలు ఉన్నాయి. నీవు నాకు తండ్రితో సమానమనుకునేవాడిని. కనుక నీవు నా చదువు గట్టెక్కిస్తావని నమ్ముతున్నాను.

ఇట్లు
నీ తమ్ముడు నారాయణ

ఉత్తరమంతా చదివి 'ఎన్నడు రాసినదీ ఉత్తరం?' అది ఏడు సంవత్సరాల కిందట తేదీ ఏప్రిల్ నెల అంటే పరీక్షల ముందర రాసింది.

ఉత్తరం చదివినప్పుడు అందరూ విన్నారు. కాని మళ్ళీ 'ఏది ఉత్తరం' అంటూ చేతిలోకి తీసుకొని మళ్ళీ చదివాడు.

ఉత్తరం చివరగా కొన్ని వాక్యాలున్నాయి. అవి శేషయ్య ముందుగానే చదివాడు.

"నాభార్య జయంతి పుట్టింట్లోనే ఉంటున్నది. మగపిల్లవాడు పుట్టాడు. భాగాలు పంచుకునేటప్పుడు నీవు నాకిచ్చే డబ్బును తీసుకొని మిగిలినదే జయంతికివ్వు. నీవు నాకు ఆత్మీయుడవని ఈ బాధ్యతను నీకు అప్పగిస్తున్నాను. మరొక సంగతి. నేను పుడుడు వచ్చిన తరువాత జయంతిని బాబును చూడలేదు. ఎందుకంటే-ఒకటి-నా దగ్గర డబ్బులేదు. ప్రయాణానికి. రెండవదీ డబ్బుకోసం అందరి ముందర చెయ్యిచాచి లేదనిపించుకోవటంతో నా అభిమానమంతా చచ్చిపోయింది. నా దీనమైన పరిస్థితి జయంతికి తెలియటం నాకిష్టంలేదు. ఆమె మనసు చాలా సున్నితమైనది. భరించలేదు. అన్నయ్యా భారమంతా నీ మీద వదలిపెడుతున్నాను.

ఇట్లు
నీ తమ్ముడు నారాయణ

"నీకు నాన్న ఈ ఉత్తరమెందుకు పంపలేదు?" అందరూ ఒక్కసారి అడిగారు.

"అదే నాకు సందేహంగాఉంది. నేను ఇక్కడికి దగ్గరలోనే ఉన్నాను. ఆ

ఉత్తరానికి స్టాంపుకూడా అతికించక్కరలేదు. ఊరికే డైరక్టు చేస్తే వస్తుంది. నాన్న అశ్రద్ధ చేశాడా ? లేక నా మీదకూడా కోపం వచ్చిందా ?'' అన్నాడు శేషయ్య.

"ఇనప్పెట్టెలో పది రూపాయలుండట మేమిటి? ధాన్యమమ్మి నాలుగువేలు తెచ్చియిచ్చాను. పసుపు పంట మీద ఈసారి బాగా లాభం వచ్చింది. ఎనిమిది వేలు ఈ సంవత్సరానివి. ఇదివరకూ ఇచ్చిన డబ్బు ఉండాలి కదా?'' రెండవ కొడుకు అన్నాడు.

నిజ పరిస్థితి ఎవరికీ అర్థం కావటంలేదు. అంతా అయోమయంగా ఉంది.

నాలుగు గంటలకు జీపులో ఏడేళ్ళ ఫణికుమార్ పతంజలితో లోపలకి వచ్చాడు.

అక్కడున్న వాళ్ళకు పతంజలి కొద్దిగాజ్ఞాపకం. కాని అతడు పోలీసాఫీసరు డ్రెస్సులో ఉన్నాడు. పిల్లవాడెవరో తెలియదు. చూస్తూ నిలబడ్డారు.

ఇంక పతంజలికి తనను తాను పరిచయం చేసుకొని పిల్లవాడిని గురించి చెప్పక తప్పలేదు.

"ఈ అబ్బాయి ఫణికుమార్. నా చెల్లెలి కుమారుడు. నాచెల్లెలు జయంతి భర్త తనకు రాసిన ఉత్తరం చదువుకుని బావిలో పడి చనిపోయింది. చనిపోయే ముందు నాకొక ఉత్తరం రాసి పెట్టింది. మూడోనాటికి శవం పైకి తేలిన తరువాత టూరులో ఉన్ననాకు తెలిసింది. జయంతి నాకు రాసిన ఉత్తరం, నారాయణ జయంతికి రాసిన ఉత్తరాలూ ఇవిగో చూసుకోండి. రెండు ఉత్తరాలు శేషయ్య చేతికిచ్చాడు.

జయంతీ,

జీవితమ్మీద విరక్తి పుట్టి నా జీవితాన్ని సముద్రుడికి సమర్పిస్తున్నాను. బాబును జాగ్రత్తగా పెంచు.

నీ నారాయణ.

శేషయ్య చదివి పిల్లవాడిని పరీక్షగా చూశాడు. "నారాయణ ఏడేళ్ల పిల్లవాడుగా ఉన్నప్పుడు ఇలాగే ఉండేవాడు" అతడి కళ్లు చెమ్మగిల్లాయి.

"గురవయ్య తన యావదాస్తినీ ఒక వర్తకుడికి అమ్మాడు. కాని ఆస్తిని అతడికి ఇంకా అప్పగించలేదు. కొంత గడువు కోరాడు. ఆ గడువు దాటిపోయింది. ఆ వర్తకుడు కోర్టుకు వెళ్లాడు. కోర్టువారు అతడికి ఆ స్తిని అప్పగించవలసినదని ఉత్తరువులు జారీచేశారు. అవి మీకు ఒకటి రెండు రోజులలో వస్తాయి. ఇంక నేను వచ్చినపని ఏమిటంటే గురవయ్య పేరుతో చలామణి అయ్యేవ్యక్తి సంఘవిద్రోహక సంఘానికి నాయకుడు. ఇతడు ఆ సంఘానికి ధనసహాయం బాగా చేస్తున్నాడు. ఈ సంగతి పోలీసువారు తెలుసుకున్నారు. ఇతడికి వరదయ్య అనే అనుచరుడు ఉన్నాడు. అతడు డబ్బూ ఉత్తరాలూ సంఘానికి అందిస్తాడు. నేను ఈ వ్యక్తిని అరెస్టు చేయటానికి వచ్చాను. ఇదిగో అరెస్టు వారంటు'' చేతిలోని వారెంటు చూపించాడు పతంజలి.

''మానాన్న చనిపోతే మేము దహనక్రియలు చేశాము" అన్నదమ్ములు ఒక్కసారే అన్నారు.

"మీరు దహనక్రియలు ఎవరికి చేశారు? వెంకటస్వామి అనే వాడికి చేశారు. మేము వెంకటస్వామి కోసం పదేళ్లనుంచీ గాలిస్తున్నాము. అతడి మీద ఎన్నో హత్యానేరాలున్నాయి. దోపిడీలు దొంగతనాలు అనేకంగా చేశాడు. ఈమధ్య మా పోలీసులు అతడిమీద తుపాకి పేల్చారు. భుజమ్మీదుగా గుండు దూసుకు పోయింది. పరుగెత్తాడు. ఏ తుప్పలలో దాగాడో కనబడలేదని పోలీసులు అన్నారు. అతడు ఒకసారి జైలునుంచి తప్పించుకుని పారిపోయాడన్న నేరం కూడా ఉంది'' గంభీరంగా అన్నాడు, పతంజలి. అతడు పోలీసు ఆఫీసరు డ్రెస్సులో చేతిలో ఉన్న కర్ర ఆడిస్తూ అన్నాడు.

"మా నాన్నలో కొంతకాలం నుంచీ మార్పు కనబడుతూ వచ్చింది. మా అమ్మ చనిపోయిన తరువాత విచారమేమో అనుకున్నాము. ఆమెను మరచిపోలేక పోతున్నాడేమో ననుకున్నాము. నారాయణను చదువుకు పంపించిన మానాన్న చివరకు వాడి ఆత్మహత్యకు కారకుడయ్యాడంటే నిజమే అయినా నమ్మలేకుండా ఉన్నాము. నారాయణ మీద మా నాన్నకు ఎంతో ప్రేమ. అటువంటివాడు ''నీవు చచ్చినా డబ్బు పంపించను" అని ఎట్లా అన్నాడో అర్థం కావటం లేదు. మా నాన్న అప్పులివ్వడం భూములు తనఖా పెట్టించుకోవటానికి ఒప్పుకునేవాడు కాదు. ఇప్పుడు ఆయన అటువంటి పనులు చేసి పదెకరాలు సంపాదించాడని ఈ పదిరోజు

లలో వింటున్నాము. ఆయనకు ఎప్పుడు డాక్టర్ల వైద్యం చేయటమేగాని ఆచారి వైద్యమంటే నమ్మకంలేదు. ఇప్పుడెవరో వైద్యుడువచ్చి వైద్యంచేశాడని వింటున్నాము. ఇదంతా అయోమయంగా ఉంది" అన్నాడు చిన్న కొడుకు.

"ఆయనకు మేమంటే ఎంతో ప్రేమ. ఆప్యాయంగా చూసేవాడు. ఈ మధ్య విసుగూ చికాకూ అరుపులూ భరించలేక పోయామంటే నమ్మండి'' అన్నాడు పెద్ద కొడుకు.

పోలీసాఫీసరు నవ్వాడు. "మీరు మనిషిని గుర్తు పట్టలేకపోయారు కొడుకులై ఉండి"

కొడుకులిద్దరూ తాము వచ్చినప్పుడు అతడు మాట సరిగా మాట్లాడేవాడు కాదనీ, ఒంటినిండా తలనిండా బట్ట కప్పుకుని ఉండేవాడని గంటా రెండు గంటలు తప్ప ఎక్కువ సేపు ఉండనిచ్చేవాడు కాదనీ చెప్పారు.

"మాకు అటువంటి అనుమానం రాలేదండీ ఎప్పుడూ? మనిషి స్వభావం మారిందనుకున్నాము"

"వర్తకుడికి భూమి అమ్మినట్టు చేసిన సంతకము ఫోటో తీయించి తెచ్చాను. ఈ సంతకం ఆ సంఘనాయకుడు వెంకటస్వామి సంతకంతో సరిపోయింది. చూడండి ఇది మీనాన్న సంతకమా ?''

అందరూ పరీక్షగా చూశారు. ముఖాల మీద సందేహం తాండవించింది.

"చెప్పండి మీ నాన్న దేనా ?"

"మానాన్న సంతకంలేదు. ఆయనకు చేతులు వణికేవి. సంతకం సరిగా చెయ్యలేక పోయేవాడు."

"ఇప్పుడర్థమైందా ? ఈ వెంకటస్వామి మీనాన్న దగ్గర డబ్బు బాగా ఉన్నదనీ ఒంటరిగా ఉంటున్నాడనీ హత్యచేసి ఆయన స్థానమాక్రమించాడు. మీ నాన్న దాచిన డబ్బు ఆస్తి అమ్మిన డబ్బూ వరదయ్య చేత సంఘానికి పంపించాడు".

"మేము మేజర్లము. మా సంతకాలు లేకుండా అమ్మకం చెల్లుతుందా ? మేము దావా వెయ్యవచ్చుకదా ?"

"వెయ్యండి. మేము ఈ కేసును ఎంత కాలంనుంచో దర్యాప్తు చేస్తున్నాము. ఆధారాలు దొరక్క కొంతకాలం, ఆధారాలు దొరికిన తరువాత నేరస్థులు దొరకక కొంత కాలమూ గడిచింది. మాఅధికారి ఫైలు మూసెయ్యమని అన్నాడు. కాని మళ్ళీ ఆ గుంపులో ఒకడు పట్టుబడి, ఈ విషయాన్ని బయట పెట్టాడు''

కొడుకులకు ఈ విషయం విన్న తరువాత ముఖాలు చిన్నబోయాయి. ఇటువంటి కేసు ఇప్పట్లో తేలుతుందా?

"వర్తకుడిచ్చిన డబ్బు సంఘ విద్రోహుల పాలయింది. ఈ అమ్మకం చెల్లదని మీరు కోర్టుకు పోతారు. ఆస్తిని తనకు అప్పగించమని వర్తకుడు ముందు కోర్టుకు వెళ్లాడు. వెంకటస్వామి మీద ఇటువంటి కేసులు కొన్ని ఉన్నాయి. వాళ్లంతా మీలాగే నష్టపోయారు. డబ్బు తిరిగి ఎవరికీ రాదనిపిస్తుంది. భూములు కూడా అంతే. మీకు ఈ పిల్లవాడు ఎవరో తెలుసా?"

అందరూ అతడి ముఖం వైపు చూశారు.

''ఇతడి పేరు ఫణికుమార్. అందరికంటె అధికంగా నష్టపోయినవాడు. వెంకటస్వామి వల్ల తల్లిదండ్రులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మీరు డబ్బు పొలాలు పోయాయని బాధపడుతున్నారు. కాని ఇతడికి జరిగిన అన్యాయాన్ని తలుచుకుంటే గుండె కరిగి పోతుంది. వీడి తల్లి వీడిని నాకు అప్పగించింది. నాకు పిల్లలు లేని లోటును వీడు తీరుస్తున్నాడు. వీడి ఉనికి మీరెవరు గుర్తించలేదు. వీడొకడున్నాడని మీకు చూపించటానికి తీసుకు వచ్చాను" అంటూ ఫణికుమార్‌తో జీపు ఎక్కాడు పోలీసాఫీసరు పతంజలి.

ఇదంతా నిజమేనా ? ఇన్ని ఆధారాలు కనబడుతుంటే నిజం కాకుండా పోతుందా ? అనుకున్నారు కొడుకులు.

---